PS01F341

Troedio Trosesu

Rhigos

5

సూక్తిలహరి పుష్పములు

PS01F341

నూతిలో గొంతుకలు

బి రా ని

ఏ. బి. సి. ప్రచురణలు :

894.827 1(8)
బి. ఓ - సం: 2
2692

సర్వ స్వామ్యములు
ప్రచురణ కర్తవి.
ముద్రణ - 1978
ఉదయ ఎంటర్ ప్రైజెస్
హైదరాబాద్ - 4.

వెల : 5-00

ప్రతులకు :
ఏ. బి. సి. ప్రచురణలు
6-1-1081/6 లకిడికాపూల్
హైదరాబాద్ - 500 004.
ఫోన్ - 33970.

కొలిపలుకు

ఈ పుస్తకానికి పీఠిక అవసరం లేదనుకొన్నాను. కాని మళ్ళీ నాలుగు ముక్కలు వ్రాతామని బుద్ధి పుట్టింది.

న్యాయంగా ఏ కృతైనా దాని కదే భాష్యం. కావ్యం తనంతట తాను వెలువరచలేని అర్థాన్ని ఏ భాష్యకారుడూ వెలువరచ లేడు. కావ్యం స్వతస్సిద్ధం. దానికి భాష్యకారుని చేయూత అవసరం. పోతే భాష్యకారుడు అపరిణత బుద్ధులైన పాఠకులకు సహాయకారి కావచ్చు. సాధారణార్థాలు బోధించవచ్చు. కాని ఈ ప్రయత్నంలో తరచు అతడు కావ్యంలో మన్నణత్వాన్ని చెడిస్తాడు. అతి సున్నితంగా వ్రేలిడవలసిన చోట నానార్థాలు చేసి తుదకు రసాభాస చేసి కూచుంటాడు.

అయితే నే నీ కొలిపలుకు ఎందుకు వ్రాస్తున్నట్లు? ఇది పూర్వాభాసం కాదు. భాష్యం కాదు. మరి ఏమిటిది? సంజాయిషీ వంటిదా? అసలు సంజాయిషీ అవసరమా?

అసలు పేరునుంచి ఎత్తుకుంటాను. గొంతుకలు వస్తున్న మాటలో నీళ్ళు లేవు. అదొక పాడు నుయ్యి. పాడు నుయ్యి పతనానికి, మరణానికీ సాంకేతం. అందులో జీవనం ఉండదు. అందులో పడి ఉన్నవారికి వెలుగు గోచరించదు. పైకి ప్రాకటానికి ఆధారం కనుపించదు. వారు కేకలు వేస్తారు. కాని వారి గొంతులు బయట వారికి స్పష్టంగా వినిపించవు. భూగర్భపు లోతులు వారిని బాహ్య ప్రపంచాన్నుంచి వేరు పరుస్తున్నవి. వారు యాత్రికులు కూడా కారు. వారి కొక గమ్యం లేదు. చీకటి తప్ప వారికి తోడెవ్వరూ లేరు. వారు గర్వాంధతవల్ల అభిశప్తులైన నహుషులు. కాని ఆ పాపం వారిదే కాదు. అందరిదీ; అది సమస్త మానవకోటికీ వర్తిస్తుంది.

మాటలో గొంతుకలు సంశయ కావ్యం. దీనిలో మానవుడు 'ఏది త్రోవ?' అనే అడుగుతున్నాడు. 'నాన్యః పథా విద్యతేఽయనాయ' అని చెప్పగలిగే స్థితిలో లేడు. చీకటిలో ప్రారంభమైన ఈ కావ్యం 'ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలను'

చర్చిస్తున్నది. దీనిలోని నాయకులు 'హేమ్లెట్, అర్జునుడు, రాస్కల్నికోవ్', సందిగ్ధావస్థలో ఒక క్రమబద్ధమైన పరిణామాన్ని సూచిస్తున్నారు. హేమ్లెట్ వేదన కర్మపూర్వం. అర్జునుడి వేదన కర్మక్షేత్రంలో తక్షణికం. రాస్కల్నికోవ్ బాధ కర్మ తరువాత. కాని ముగ్గురి బాధ ఒకేస్థాయిని అందుకొంటుంది అది మానవుని సహజ వేదన. అతణ్ణి త్రికాలాల్లోనూ వెంటాడుతుంది. ఆ బాధలో మధనపడనివాడు పూర్ణత్వాన్ని అందుకోలేడు. ఆ బాధనుంచి అతను తప్పుకునే మార్గం లేదా - అంటే ఉంది. పలాయనం, కృతకశక్తుల పూజనం. ఆత్మహననం.

ఈ కావ్యంలో నేను అంటే కవికాదు. నేటి మానవుని అనుభూతిలో అది కవితాత్మకం. స్వీయబాధ వెలువరించటం కవి పరమావధి కాదు. ప్రపంచంతో ఏకమైననాడే కవికంఠం పరిగా పలుక గలుగుతుందని నా నమ్మకం. ప్రపంచానుభూతిలో స్వీయానుభూతి పరమైనపుడే ఉత్తమ కవిత ఉద్భవిస్తుందని నా విశ్వాసం.

'మాతిలో గొంతుకలు' నేటికి నాలుగు సంవత్సరాల క్రితం 'తెలుగు స్వతంత్ర'లో ధారావాహికంగా ప్రచురించబడ్డాయి. తరువాత అక్కడక్కడ కొన్ని ముఖ్యమైన మార్పులు చేశాను. అక్కడక్కడ కొన్ని శబ్దాలూ, వాక్యాంశాలూ మార్చాను. ఇందులో కొన్ని భాగాలు 'సంఘర్షం' 'ఒక సమష్టి ప్రార్థన' వంటివి వెక్కిరింత వినిపించవచ్చు. కాని అవి వెక్కిరింతలుకావు. ఒక్కొక్కసారి భావావేగం ఉపహాసాస్పదంగా కనుపించేటంత తీవ్రమై వక్రమార్గా లవలంబిస్తుంది. ఆవేదన వ్యంగ్యం వెనుక దాక్కుంటుంది. పైన పేర్కొన్నవి అలాంటి ఘట్టాలే.

'కవి సమన్య' అభివ్యక్తి కొరకు కవిచేసే సంఘర్షాన్ని సూచిస్తుంది. శబ్దాల అసమర్థత ప్రతి కవికీ ఏదో ఒక సందర్భంలో తట్టే ఉంటుంది. కవితాకామిని చేలాంచలాల కొన వినురులు ఎప్పుడూ ఒక బారెడు దూరానే మాయమైనట్లు అగుపిస్తాయి.

నేను చెప్పవలసింది ముగిసిం దనుకొంటాను.
ఇక ఉంటాను.

—బైరాగి

వాతిలో గాళ్ళుకలు

"And Voices singing out of empty cisterns
And exhausted Wells."

'Wasteland' T. S. Eliot,

I

రాత్రి
కాలరాత్రి
కరాళ కాలరాత్రి,
ఆదిమ తమస్సులు ఆవరించాయి ఆకాశాన్ని
అవనిని, అనాథ హృదయాన్ని.
కప్పేశాయి కాటుక చీకటి మంచులు
ప్రలయోన్ముఖ పురాతన ప్రపంచాన్ని.
శబ్దం లేదు గాలి లేదు
చీకటికి జాలిలేదు
చూపులేని రూపులేని
రేపులేని మాపులేని
ఈ పెనుచీకటి నిముసం
బ్రతుకుల నల్లని కుబుసం
మన్నుతిన్న దానిలాగ
పొరలుతోంది మన్నుమిన్ను ఒకటిచేసి
కాలాభీల వ్యాలం
కలికల్మష కలుషరాశి
నిండిన దిగంతరాలం

2

ఈ పెనుచీకటి నిముసం
నిర్జీవం నిర్గంధం
పసగల రుచిలేని విషం
విరిగిన వెవ్వెముకల ఛందం.
రాత్రి నిదురబోతున్నది
జగతి నిదురబోతున్నది
నిదురబోతున్నది వీణ
మూగిగాయకుని గొంతుక
నర్తకీ వినీలవేణి
తరుణారుణ చరణాలు
చరణ మంజీరరణనాలు
శిథిల భుజపాశాలు
ఉన్నతవక్ష నిశ్వాసాలు
నిదురబోతున్నాయి గుండెదడలు
కాంత కనీనికల్లో
కాంతుని కాంతుల కలలు
నకల కళల కలల వలలు.
నిదురబోతున్నాయి వాడిన పువ్వుల్లో ఆశలు
మొగ్గల్లో నిరాశలు
ముళ్ళలో హెచ్చరికలు
కీచురాళ్ళ నైశ్శబ్ద్యపు గురకలు.
రేయి పలవరింతలు వినిపించవు వాలిన ఆకుల్లో
చెరిగిన నుదుటి రాతలు కనిపించవు రాలిన రేకుల్లో
చేతులు చదివేదెలాగ ?
చీకటికి చలనం లేదు.
లక్షల నక్షత్రాలు, సూర్యచంద్రులు
మానవ మేధన్నుల మొగ్గలిడిన సిగ్గరి మిణుగురు పెలుగులు

నిగ్గుగల మెరుపు మెరుగు, రైళ్ళ ఓడల దివ్వెల పరుగులు
ప్రశాంత కుటీరాల నిశ్చల దీపక కాంతులు
చిత్తడి నేలను, కడలి కడుపున వినీలభాస్వరికాంతులు
చంచల నయన కాంతులు
ఎన్నోవున్నాయి, కాని చీకటికి చలనంలేదు.
చరిత్ర చిహ్నాలై విరిగిన చక్రాలు త్రోవనిండా
ముళ్ళపొద నలంకరించినది జండా
ఒకదానొకటి మ్రింగేశాయి రాకల, పోకల అడుగు జాడలు
తుప్పుపట్టాయి కత్తులు, అట్లకాడలు
ఎక్కడ పనీ్నటిబుడ్లు ?
భూగర్భ నాగరికతల మిగిలిన గురుతు మరుగుదొడ్లు.
ఎక్కడ వున్నాయి రోమ్, బ్యాబిలోను, ఇంద్రప్రస్థం ?
దస్తావేజే లేదే, దస్తూరెలా స్వహస్తం ?
అంధకార సాగరాన పయనించిన ఓడల గురుతులుండవు
వల్లకాటి మునివాకిట నాటిన మొక్కలు వండవు.
చివరకు చీకటొకటే, చలనంలేదు చీకటికి.
హేమంత వసంతాలాద్యంతాలు
కొంతలు, సాంతాలు
ఎరుగనివీ తమస్సులు
లేవిక్కడ ఉషస్సులు.
ప్రపంచమను పొగగొట్టంలో
కాలం రాజిన మసిలా
బహిరంతర దిగంతాలు
భ్రాంతించిన ధ్వాంతంలో
ఋజువెక్కడ,
తెరువెక్కడ ?
ఈ నల్లని మునుగులోన దాక్కొన్నది ఎవరిముఖం

ఈ చీరచెరగుచాటున దాగివున్నదే హృదయం
ఈ శూన్యావరణంలో ఏమున్నది స్పర్శసుఖం
త్రోవ తెలియ దెటువున్నది ఆలయం
చీకటినాడి ఎక్కడ ?
చీకటినాడి దొరికితేనే తెలుస్తుంది త్రోవ నాకు
గంటలజాడ పలికితేనే తెలుస్తుంది త్రోవ నాకు
కాని చిమ్మచీకటిలో
ఎవరి కెరుక ఏముందో వాకిటిలో
చీకటి రాకాసి గురక
అక్షరాలు కనిపించని సిరామరక
నాగరిక ప్రపంచపు
భీకరతర కాననంలో
మహాజనసమ్మర్దపు నీరవనిర్జనంలో
మానవాత్మ నిశ్చల నిశీథంలో మేలుకొన్న
తల్లిలేని పిల్లనిలా ఏడ్చే ఈ క్షణంలో
కొడిగట్టిన దీపాలు, కక్కుతున్న కలాలు
దున్నని పొలాలు
పనిచేయని హలాలు
భవిష్య ద్విపత్తులను సూచించే స్వేదంలో
విగతవివశత్వం నిరూపించే ఖేదంలో
ప్రతి ఒక చూపు మింటివైపు
మరలుతోంది శూన్యంగా, దైన్యంగా.
వర్షం కొరకు, బాంబుల వర్షం కొరకు
తెగింపుతో, ముగింపుల తెగింపుతో.

II

శతసహస్రశబ్దాల స్రఖరశరపరంపరముందు
నిశ్చలమై నిలచిన నిశ్శబ్దంలో

నానారావ తరంగతురంగాల ఉరవడిక్రింద
నిలవనీరుల నికరపు నిశ్శబ్దంలో
ఆడే చేతులక్రింద, వాగే జిహ్వలక్రింద
సొమ్మసిలిన హృదయమందు
ఆటముందు పాటముందు
ప్రణయంముందు ప్రళయంముందు
ప్రగల్భ నిరీక్షణతో నిండిన, పండిన ఈ నిశ్శబ్దంలో
వేచియున్నవాడే ప్రతిఒక్కడు
మార్పుకొరకు, తీర్పుకొరకు
ఓర్పుగలిగి
చరమ ఘంటారావం కొరకు
తప్పిపోయిన భావం కొరకు.
ప్రతి మనిషీ ఒక గదిలో
చెదపురుగులు ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక నదిలో
సుడిగుండం ప్రతి ఎదలో
ప్రతి మనిషీ ఒక చెరలో
ఉరికంబం ప్రతి హృదిలో
ప్రతి మనిషీ ఒక మరలో
మరమేకులు ప్రతి ఎదలో
ప్రతి మనిషీ ఒక సెగలో
పొగగొట్టం ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక పొదలో
బెబ్బులిరొద ప్రతి హృదిలో
ఉన్నది ప్రతి హృదిలో గోరీ ఒకటి
పాడె ఒకటి, పుట్టె ఒకటి
పది కొమ్మల మ్రి ఒకటి

మర్రిలో తొర్ర ఒకటి
తొర్రలో బుర్రుపిట్ట
ఏది తుర్రుమనే త్రోవ,
ఈ చీకటి దాటించే నావ ?

ఒంటరిగా, ఒంటరిగా
నీడల వాడనున్న మ్రోడులాగ
మ్రోడుల నీడనున్న నీడలాగ
త్రోవ మరచిన ప్రేతంలాగ
దిక్కులేని కుక్కలాగ
తిరుగుతున్నా, తిరుగుతున్నా
చీకటిలో చీకటిలో.
నే నెరిగిన ముఖ మెక్కడ ?

(ఎరిగిన నుఖమే దుఃఖం)
నే నెరుగని నుఖ మెక్కడ ?

ఆశించను శుద్ధ వివేకపు వరవిద్యుత్కాంతులు
ఆశించను త్యాగరాగరంజిత ప్రణయ జ్యోతులు
శాసించ సాహసించను జీవితధ్వాంత భ్రాంతుల
భాసించను అదృశ్య రహస్యాల కడలి లోతులు
ప్రభాపూత పరమ ప్రాతశ్శాంతిగాని
రాకేందు సుధానందపు నిర్ద్వంధ్వకాంచనకుంద కాంతిగాని
ఆశించను, ఆశించ సాహసించను

జననమరణ యుగళఝుంఝుల కందని తీరాల్లోని
సంశయ శాపశ్వాసలు సోకని దివ్యతీర్థ నీరాల్లోని
ప్రభాభానురశ్వేత శతపత్రం కొరకు, ఆశించను
నాకుచాలు నొక కిరణం
ఒక దుర్బల కాంతికణం
ఈ మృణ్మయ దీపంలో

ఒక నిమునపు ప్రజ్వలనం
కాంతి క్షణం
కాంతి కణం
ఒక కిరణం
కనిపించవు చీకటి కూకటివేళ్ళీవాటికలో
వినిపించవు నటుల సొంతగొంతుక లీ నాటికలో
హంగుతీసి రంగు కడిగి దుంగలా సొరంగంలో
వెల్లికలా పడివున్నప్పుడు తీరుగ తేరిచూడు
ధ్వనిస్తుంది ఖడ్గమృగం మూలుగు అంతరంగంలో
వారి వికృతవదనం మీద నల్లగా వల్లకాడు.
తక్షకవత్ ప్రత్యక్షం వంచిస్తుంది రూపుమార్చి
వృద్ధ విప్రవేషంలో పిరికివడిన పరీక్షిత్తును
పరోక్షం నిరీక్షిస్తుంది తళతళ పయ్యెదజార్చి
పరోక్షం పరీక్షిస్తుంది పాతిన ఓపికవిత్తును
త్రోవలు రెండేరెండు త్రోవతెలియగలందులకు
నీలోనిన్ను, నర్వజగతినికూడ కలియగలందులకు
ఒకటి, వెలుగుకొరకు వేచియుండి విజయఫలసాధన
రెండు, కటికిచీకటిలో దూరదృష్టి సంపాదన
ఒకటి నీలినాకసంలో ఎగిరేపులుగుల త్రోవ
రెండవది మురికిమంటిని మెలగే పురుగుల త్రోవ
రాచిలుకలు, గోరింకలు, పికిలిపిట్టలు మోదంగా
పలుకుతాయి తెరచివున్న దిక్కుల ద్వారంలోంచి
వాయువులో వలయాలై విహరిస్తయ్ వినోదంగా
కిలుకుతాయి లేపచ్చని కొమ్మలపై విశ్రమించి.
కాని యింక గుడ్ల గూబలు, చిమటలు, గబ్బిలాలు, వానపాములు
ఏంచేస్తయ్! వేచివుంటవి చీకటికొరకు
లోకాలు రాత్రి ఒడిలో తలదాచుకొనేవరకు.

సాహసికుడా, కనిపించవు చీకటి కూకటివేళ్ళ వాటికలో
చొచ్చుకపో చీకటిలోకి
చీకటి గుండెల్లోకి
ఈ మంటిని యీ రాతిని
ప్రత్యక్షపు కూటనీతిని
తొలచి మలచి చీకటిలో
చొచ్చుకపో గ్రుచ్చుకపో
ఆత్మల అగాధంలో
లోకాలశోకంలో, విషాదంలో
నిరాశలో, ఆరని పిపాసలో
భూగర్భ నరకవాసుల దగ్ధహృదుల శ్వాసలో
చొచ్చుకపో చిమటల దీక్షతో, వానపాముల ఓపికతో.
పై నున్న కటికపొరను తొలచుకొంటూ
అణువణువు గెలచుకొంటూ
పాతాళపు గర్భగుడికి
మందంగా న్పందించే
ఈ చీకటి నాడికడకు.
కూకటి వేళ్ళ రహస్యాలు తెలిసిన తరువాతనే
తెలిపూవుల తొలిపలుకులు వినవస్తాయ్ నీ చెవులకు
కన్నీరుల కుంభవృష్టి వెలిసిన తరువాతనే
హరివిల్లుల రంగవల్లులు, కనిపిస్తాయ్ నీ కనులకు
ఏడుగోడల పెట్టనికోట దాటితేనే
రాకుమారి నివసించే ఒంటిస్తంభం మేడ
ఎగిరే ఇనుకదిబ్బల ఎడారి దాటగానే
రేవులో న్వదేశానికి తిరిగి వెళ్ళే ఓడ
చొచ్చుకపో ఆత్మల చీకటిలోకి సాహసికుడా !
ఆత్రంగా గుండెదడలు, నాడి దడలు లెక్కిస్తూ

9

ఎక్కుపెట్టిన విల్లులాంటి శూన్యంలోంచి
విడచిన బాణంలాగ ధైర్యంతో తొలచుకపో,
ఐక్యమవ్వు చీకటిలో.
అంధాత్మల అధినివేశపు లోతుల్లో పాతుకపోయి
పగటి చుక్కలు చూచాక, మూగగొంతులు విన్నాక
ఆశలపాశం నీకు నేర్పుతుంది నీ నిరాశ
ఆహ్లాదానికి అర్థం గరుపుతుంది విషాదం
పూర్ణత్వపు సూత్రం విడమరుస్తుంది చీకటి
అప్పుడు వింటావు నీవు
ఉరియుచ్చుల అనుభవాలు ప్రకటించే
మాటిలోని గొంతుకలు

III

ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలు
ప్రాలేయ ప్రళయ ప్రభంజన విజృంభణ హిమగిరి శిఖరంపై
దుర్భర లావాకీలలు అగ్నిశైల గర్భంలో
ఆఫ్రికా అరణ్యాల్లో వన్యమృగాక్రందనాలు
ప్రశాంత సాగరంలో నిరతాశాంత రాగమాల
విరాడ్విశ్వ మందిరాల కవాటాలు మూసిన ధ్వని
కోప భవనపు కైకేయి, మంథరా మంథర గతులు
విదూషకుని విషాదం, ఉన్మత్తుని ఆహ్లాదం
వేశ్యల వివాదం, ఓంకార ప్రణవనాదం
బ్రహ్మాండ భాండాల పగిలిన చిల్లపెంకులు
గ్రహగోళ రసాలాల చీకిన ఎండుటెంకలు
వింధ్యా గర్వభంగం, వంధ్యా గర్భవేదన
సంధ్యా శివతాండవం, సప్తసాగర నీరాన్ని
పుడిసిటపట్టి త్రాగిన ఘటోద్భవుని దాహం
నయాగరా కన్నీరుల తీరాల ధరాధరాలు

10

జ్ఞాపకముందా నీకు ?
వడగళ్ళ వినురు వాన,
తొలకరి తళుకు మెరుపులు
తడిసి నీళ్ళు చిందగొడుతూ పరుగులిడే
పసిపాపల నవ్వులు, చప్పట్లు, కేకలు, అరుపులు.
మన చిన్నతనంలో వసార ప్రక్క కాలువలో
వాననీళ్ళు వచ్చినప్పుడు కాగితాల పడవలు తయారుచేసి
వదిలిపెట్టే వాళ్ళం మనం;
అప్పుడు చిన్నతనం
లేపచ్చని నారుమడిలో చల్లగాలి,
వెల్లకిలా పండుకొన్న వధూపక్షపు జాలులాగ
లేచి వాలే మొగమ్లు తరంగాలు,
వినీల వ్యోమం నుంచి వీక్షించే విహంగాలు,
మనక చీకటి తోటలోంచి మత్తుగా మల్లెపూల పరిమళాలు
అప్పుడు వెలిగించేవారు దీపాలు.
గోరు వెచ్చని కౌగిలింత
వెచ్చని చెమటలుపోసే వేడినీళ్ళ స్నానంలా
నిద్రకొరకు అవయవాలు స్పృహతో కుట్ర పన్నినట్లు
చెవిలో ఏదో గునగునలాడినట్లు
మెత్తనిదై, నున్ననిదై జారిపోతూ
పద్మపత్రమివాంభసా కారిపోతూ
జ్ఞాపకాన్ని తప్పుకొనే పలుకుల్లా
మనసును కలవరపరచి, ముక్కులను మోసగించే
అవ్యక్త పరిమళంలా, రాలే కుసుమదళంలా
నగం గురుతు నగం యిరులు, ఒక భావన
స్వప్నంలోంచి జాగరణ ప్రథమదశలా
కాలానికి దూరంగా దాచిన మణి ఒక్కక్షణం

11

అట్టే బలవత్తరం కాదు, కాని మహత్తరం
ఆనన్న మరణంలా విషణ్ణంగా కైసన్న నల్పుతోంది
తెరచిన ద్వారంలోంచి, వెలుగు నీడల మధ్యనున్న లోతుల్లోకి
నీ హృదయపు చీకటుల అగాధంలో

IV

ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలు
విమోచనపు యోచనలేని శోచనీయ శర్వరిలోన
ఆలోచనల లోచనాలు మూతబడిన ముహూర్తాన
ప్రాతస్సూర్య స్వర్ణశంఖం, రాకాపతి రజతశంఖం
రెండూ మూగబోయినవేళ
తిరుగుపోకకు త్రోవలేని చివికిన చీకటుల మూల
నకల రేఖా సంగమ కేంద్ర బిందువు క్రింద
ఆక్రందన స్యందనాల మందాగమరవం ముందు
నిలబడి ఒక్క ఉదుగుతాను బాబూ! చెప్పు
ఎక్కడ బయలుదేరాం మనం?
కడ కెక్కడ చేరాం మనం?
చీకటి కాటుక పాము కాటుందినచోటు ఇదే
నిలువెల్లా వినపుటిలలు పొంగి పొరలే పోటు ఇదే
దిక్కు తోచని దిక్కు ఇదే, మ్రింగరాని గ్రుక్క యిదే
ఇదే నరుని శ్రమ సంకట సహన యాత్రల చరమసీమ
జీవిత మిట నిరావరణ నిరాభరణ నగ్నచ్ఛవి
వికట కుటిల మనఘటా చ్ఛటాజటా నటద్భైరవి
జీవిత మిట కామాతుర కంకాళ కరాళకేళి
ప్రేమేతర మృతికాతర కపాలాల కృపణధూళి
జీవిత మిట బీభత్సోత్సవోత్సాహ ప్రేతహేల
రుధిర మధుపు గ్రోలి సోలి దైత్యుల మత్తిలిన లీల
జీవిత మిట నమ్మర్దం సంఘర్షం సంక్షోభం

దుశ్శోకపు దుస్స్వప్నం దుర్మోహపు దుర్లోభం
జీవిత మిట ఒక అవిరత నీరవ రౌరవ యాతన
అవిరళ గరళస్తన్యద కుహనాధాత్రీ పూతన
జీవితము ఊరోమరువుల తృషా మృషా మృగ మరీచి
హాలాహల తరళానల చటులోచ్చల కుటిల పీచి
జీవితి మిట కటు మృత్యువు జీవితమిట అకృత్యం
జీవిత మిట ఒక దుస్తర ప్రస్తర హస్తపు నత్యం

ఐతే ఇక మిగిలినది
నీవు పొందగలిగినది
ఏమున్నది లోకంలో
ఈ శోకపు లోకంలో
ఘూకకులపు నాకంలో

ఇచట నీవు జీవిస్తున్న ప్రపంచంలో ఆత్మలు (అనేవి ఒక టుండే)
ఎన్నటికీ వాడిపోవు కాగితాల పూలలాగ,
నా ఆశల విశ్వాసాల వాడిన వడలిన పూలు
ఎవరి మొగం ఎరువు తెచ్చుక తేగలనో నీ వద్దకు,
భిన్న ప్రకృతుల ఇంద్రియాల రంగురంగుల కళ్ళజోళ్ళు
ఉద్రేకాల ఆవేశాల తప్పుడు బేరో మీటర్లు
పనిచేయని దిక్సూచి వివేక మిది
వాస్తవిక ప్రపంచంలో ధ్రువతార ఎక్కడున్నది ?
పగిలి విరిగి చెరిగి చిరిగి ముక్కలైన చెక్కలైన
ఈ జ్ఞానం ఏమిటి చెబుతుంది నీకు ?
నికరమేది, ఖాయమేది
ఆంశికనత్యాల ఆర్ధనత్యాల అనత్యాల ఆధిపత్యంలో
ముక్కూ చెవులూ తెగిన నత్యాన్ని గుర్తుబట్టలేవు నీవు
విప్లవాల ప్రనవ బాధల దైత్యశిశువు భస్మానురుడు,
నిలకడగల నమ్మిక ఎలా కలుగుతుంది

జ్యోతి ఎలా నిశ్చలమై వెలుగుతుంది
మన ప్రేమలు స్నేహాలు సౌహార్థాలు
మలినమైనవి అన్నీ చేతులుమారి రకరకాల,
కల్తీలేని నరుకులేవీ దొరకవీ అంగడిలోన
నీ అత్మకు ఆహారం వనస్పతి వంటకాలా ?
ధూళి ధూనర మలినాపూత మీ దుర్ధ్యం
ఆదర్శపు అంజలిలో ఎలా సమర్పిస్తావో
మానవజాతి నున్వప్నాన్ని ఎలా విక్రయిస్తావో ?

V

ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలు
దారుణ దావానలం దహిస్తోంది ఖాండవాన్ని
కాపలా కాస్తున్నాడు గాండీవి చండశరుడు
కరుణాకణాలు కురిసి మంట లారిపోకుండా,
మయుడు కూడా దక్కడింక
అగ్నిదేవుని అజీర్తికి ఆహుతి అవుతున్నది మన నాగరికత,
సంస్కృతి, నోచిన నోములపంట, లోకాలు మండుతున్నై
భూగర్భం బ్రద్దలుకొట్టి పాతిన పాపాలు పండుతున్నై
యుగాంత సాంధ్యకీలల దగ్ధప్రాయ దిగంతాలు
ఎవరికోసం ఎల్లోరాలు, అజంతాలు
మండుతున్నై సాహిత్యాలు, కళలు, నృత్యవాద్య గీతాలు
మండుతున్నై నుదూర శాంతి సాగర తరంగ నంగీతాలు
వినవస్తోంది ఒకేపాట భగభగ మంటలపాట
కనవస్తోంది ఒకేఆట ధగధగ మంటల ఆట
ప్రపంచ పుస్తికమొద అవల శిఖల అక్షరాలా అక్షరమైన అరాక్షల్లో
వ్రాసివుంది ఒకే ఒక్కనందేశం
ప్రళయం, ప్రళయం, ప్రళయమని,
మండుతున్నది మానవమేధ, మండుతున్నది బుద్ధి, హృదయం,

మండుతున్నవి దేహాలు, ఇంద్రియాలు, అవయవాలు
చుండుతున్నవి అనుభూతులు, అనుభవాలు, జ్ఞాపకాలు, ఆలోచనలు
ఈర్ష్యాద్వేష మోహాపోహ వాంఛా కాంక్షల కీలల్లో
జనన జీవన మరణ త్రివిధ తాపాల్లో.
ఈ మంటలార్పే దెవరు ? ఫైర్ బ్రిగేడ్లు పనిచేయవు వీటి మీద,
భీమాలేని మంటలివే.

అజ్ఞానపు టగ్నిలోంచి విజ్ఞానపు టగ్నిలోకి
అవమానపు టగ్నిలోంచి అభిమానపు టగ్నిలోకి
నమ్మోహపు టగ్నిలోంచి వ్యామోహపు టగ్నిలోకి
ఆవేశపు టగ్నిలోంచి ఆశ్వాసపు టగ్నిలోకి
ప్రేమ నుంచి ద్వేషానికి, బాధ నుంచి రోషానికి
తీరని కోరికల బొగ్గుకుంపటి మంటల్లోంచి
తీరిన కోరికల తడికట్టెల మంటల్లోకి
చైతన్యపు తుమ్మమొద్దుల మంటల్లోంచి
ఉన్మాదపు గడ్డివాముల మంటల్లోకి
వయస్కుల పురస్తాపపు మంటల్లోంచి
వయోవృద్ధుల పశ్చాత్తాపపు మంటల్లోకి;
మంటల్లో మంటల్లో పయనిస్తోంది మానవాత్మ.
రావణ చితాగ్నిలోనే సీతకు అగ్నిపరీక్ష
శాశ్వత నిరీక్షణలో అగ్నివ్రతుల అగ్నిదీక్ష.
జీవితం జీవితం జీవితం
తరతరాల స్పందనాలు నీ పిడికెడు నరాల్లోన
యుగయుగాల క్రందనాలు నీ అస్థుల వివరాల్లోన
కరిగిన సీసపుధార కారుతోంది చెవులలోకి
నిప్పులుక్కే అగ్నిపర్వత గహ్వరాల్లా రెండు కళ్లు
చేవగల చీకటి నోట మెరిసేపళ్ళు
రక్తం కాదు కరాళ కాలకూటం దేహంలో

మానవజాతి ఆర్జించిన సిఫిలిస్ నీ వారసత్వం
జీర్ణించిన మజ్జాగత సంస్కారం
భూకంపాలు, తుపాములు, కరువులు, వరదలు, యుద్ధాలు
పండిన పంటలపైన మహాసైన్యపు మిడుతలదండు
దౌర్జన్యం, దురాగతం, పిరికిదనం, వెకిలిదనం
మానభంగం, పురికంభం, ఇన్‌క్విజిషన్ గెస్టాపో, జీ. పీ. యూ
మంటలు, మంటలు, భోగిమంటలు, చలిమంటలు
పుస్తకాలు, చిత్రాలు, అజరామర కళాకృతులు
ఒకటేమిటి, ఉన్నవన్నీ ఒకచోట ప్రోగుచేసి
భూగర్భం త్రవ్వి తీసిన పెట్రోలంతా పోసి
ముట్టించి, మంటలచుట్టూ వలయంగా ఉన్మత్త నృత్యగతిలో
"అఖరుమంట కాకరకాయ" పాడుతోన్న పసిపాపలు మానవులు.
జీవితం జీవితం జీవితం
ప్రతిక్షణం ప్రసవవేదన, అనుక్షణం మరణయాతన
జెట్టులు ప్రాకుతున్నై, తేళ్లు, త్రాచుపాములు నా చుట్టూ
కత్తిరించి కుడుతున్నారు నన్నెవరో చొక్కాలా
శ్వాసనాళంలోంచి శ్వాస త్రాగుతున్నారు హుక్కాలా
ఏదో ప్రవాహంలో (బహుశా అది నెత్తురేమో)
కట్టుకపోతున్నాను. నా చుట్టూ నాతోబాటు వందలు వేలు
చేతులు, కాళ్ళు, తెగిన శిరసులు, మొండాలు, పీకిన గ్రుడ్లు
వెంట్రుకలు నాచులాగ, ప్రేవులు నరాలు కాడల్లా;
పొగచూరిన ఎబ్బకిరసన్ వెలుతురులో
కనుపించని ఒక్క చక్కని ద్రవంలోన (నెత్తురే అయి ఉంటుంది)
గిలగిల తన్నుకొంటున్నాను హంసపు ముద్దలాగ;
అరుస్తున్నాను భయంతో చుట్టూ చూసి, వినరాని కేకలువేసి.
నమస్త జీవకోటులు కొట్టుకవస్తున్నాయి
ఎటువైపు తిరిగినా ఏదో ఒకటి తగులుతోంది.

మెత్తగా, నున్నగా, చీదరగా,
బిలబిల ప్రాకుతున్నవి పురుగులు నా ముక్కులోకి, చెవుల్లోకి
ఒంటిని చుట్టి పట్టుకొనే జలగలమూక.
అదిగదిగో, కొట్టుకొని వస్తున్నది శిరస్సొకటి,
దాని నొనట ఎఱ్ఱని నోరు, మూడవ కన్ను,
తెరచిన రంధ్రమొక్కటి వెక్కిరిస్తోంది
పుర్రెల పాటలాగ గుడగుడమనే నుడిగుండం
క్రొంగ్రొత్త ఉపనదులవి, మహానగరాల మురుగుమోస్తూ
ఆసుపత్రి కాల్వల్లోంచి చీముతో, రసితో నిండి.
వినీల లోహకాంతులు విరిసినాయి దిక్కులలో
మసీగుడ్డవలె గగనం పరచుకొన్నది నల్లనిదై
ప్రవాహ వేగం వల్ల కదులుతోంది ప్రతి జీవం
చావులోకి, బ్రతుకులోకి, నిదురమగతల మూర్ఛలోకి
ముందున్నది క్షితిజం కాదు, అంతంలేని సారంగమది
గోడలు మెరుస్తున్నవి కొలిమిలో ఇనుములాగ
జీవంగల రుధిరామిషబిళం అదే
గోడలు చలిస్తున్నవి ప్రాకుతున్న పురుగుల్లా
ప్రవాహం ప్రవేశించింది గుహలో, నృష్టి రంధ్రంలో,
ఆవలనున్న సాగరంలో, రజనీ నైశ్శబ్ద్యంలో
నే వెవణ్ణి, ప్రభువునా, బానిసనా
మెదులుతున్న మాంసపు ముద్దనా, మానిసినా ?
ఈ అగ్నిశిఖల్లోంచి, ఈ రక్తముఖంలోంచి
నూతన జననమా లేక ప్రాక్తన మరణమా ?
డిటెక్టివ్ నవలల్లో నికోటిన్ కనికట్టు
బూతుకథలు, పడకకుర్చీ, గూడకట్టు
ఆశల మత్తుమందు, కోరికల కుళ్ళిన క్యాబేజీ
నిరాశల కషాయం, భావాల చిరిగిన పేజీ

నీతుల ధర్మాల పుటంవేసిన రాసౌషధులు
అస్తిత్వ విషవృక్షపు కుక్కమూతి పిందెలు
రబ్బరులా సాగుతున్న చైతన్యం తెగుతుం దున్మాదంలో
తోచని రోజుల రోడ్డుకు గండి, బ్రతుకుబండి ప్రమాదంలో
పసితనంలోంచి పసితనంలోకి
"అంగం గలితం, పలితం ముండం
దశనవిహీనం జాతం తుండం"
తిమిరోదరం లోంచి, తిమిరోదరంలోకి
"పునరపి జననం పునరపి మరణం"
తెరిచారట పిచ్చాసుపత్రి ద్వారాలు
బ్రద్దలు కొట్టారట అవ్యక్తపు టానకట్టలు
వరదలు ఉరుకుతున్నై, పొంగింది మురుగుటేరు
ఏమిటి చేశావు నీవు మానవుడా !
"కృతం స్మర, గతం స్మర, కృతం స్మర"
అనంత సాగరంలో విలయ ఝంఝ, చిల్లిపడవ
కాలరాత్రి జీవితయాత్ర
ప్రొద్దు పొడవదు, కూచునేందుకు వీలులేదు
ఒంటరిగా ఒంటరిగా మంట్లో మంట్లో
పయనిస్తున్నాడు నరుడు
ఆ వెరుగని దిక్కుకేసి

హేమ్లెట్ స్వగతం

తీగలు త్రెంచిన తుపాను తగ్గిన తరువాత నేడు
తెలుస్తున్నది విధ్వంసపు టడుగుజాడల రాలుటాకుల పూలమధ్య
వేసిన ప్రశ్న ఒప్పైనా ప్రత్యుత్తరం తప్పౌనని
ప్రత్యుత్తరం తప్పైతే వేసినప్రశ్న తప్పౌనని.
వానకు తడిసి ఎండకెండి చేరుకొన్నది నావ నేడు తీరాన్ని
పగిలి చెదిరి చిద్రుపలై మునిగి దూరపారాన్ని.
యిప్పుడింక పగమరచిన సెగలారిన చీకటిలో
నీడల నటన బాధించదు ఇంద్రియాలను
ఆవేశం అలనటగా, చైతన్యం వేడిలేని వెలుతురుగా,
కలగా, అలగా, ఒక తీయనిజలగా మారిన యీ వేళలందు
తెలుస్తున్నది చావు బ్రతుకు లిక్కడ లెక్కకు రావని
లెక్కకు వచ్చేవిచట ఒక చూపని,
ఒక నవ్వని, ఒక కిరణం ఒక పూవని,
తెలుస్తున్నది ఈ నిశ్చల నిశ్శబ్దపు సాగరాల సంగమంలో.
ఏది బ్రతుకు, ఏది చావు, పొంగే వరదల మధ్య
ఈదేవారు, ఈదనివారు, మునిగేవారు, తేలేవారు
కర్మణ్యా కర్మణ్యతల సాఫల్యా సాఫల్యాల
చలదూర్ముల ప్రహారాలు తప్పుకొని చేరుతారు ఒకే ఒక్క తీరాన్ని
కానివాళ్ళు, అయినవాళ్ళు నిలుస్తారు ఒకే ఒక్కద్వారాన్ని.
ఒక్క చావు, ఒక్క బ్రతుకు లెక్కేమిటి ?
అగాధపు టంచునున్న అనుక్షణం ప్రత్యణుపూ
ఆవేగానిశ్చయాల కుహేళికల ప్రహేళికలో
సంశయాల సంధ్యాబాహుబంధనాల హృత్ స్పందనల
ఆటుపోటులు జాలిమై మాలిమిని వాలటంలో
శతశత పర్యాయాలు జీవిస్తుంది, మరణిస్తుంది,

ఋణం మధ్య ధనం మధ్య మథనంలో ధ్వనిస్తుంది.
మరచిపోతాం సాగరప్రకోపాలు, నంతాపాలు
మరచిపోము చీకటిలో నుగు నవ్వులు, జలకన్యల ఆలాపాలు,
ఈ పూలు వడిలి చెడినా బాసిపోవు పరిమళాలు.
ఆవేదనలు, ఆనందాలు ఒరసికొంట వొండొంటిని
కలలూ, మెలకువలూ వెలిగిస్తాయ్ ఈ మంటిని.
కత్తిరించిన ఒత్తులే వెలుగుతాయి దివ్యంగా
బాధాదగ్ధ కంఠాలే పలుకుతాయి శ్రావ్యంగా
చదువుతాడు వేయ్‌మార్లు మరణించిన తరువాత
మానవుడు తా వ్రాసిన బ్రతుకుల గజిబిజిరాత,
అనుక్షణం అడుగుతీసి అడుగువేసి పోతుంటాడు
చివరకు వెళ్ళేలోపున మొదలు మరచిపోతుంటాడు
మరచినవెత చూపుతుంది అరచేతిలోన స్వర్గం
మరుపులమతి తెరుస్తుంది ఊహానూతనదుర్గం
జ్ఞాపకాల కత్తిమొనలు రక్తరాగ రంజితాలు
ఏ పాపం ఎరుగనట్టి దీమరుపుల నల్లనిడాలు
ఆకాశపు కొమ్మకొనను కూరుచున్న వేళలందు
గురుతుండదు ఏముందో వేళ్ళకొనల మట్టి క్రింద
జ్ఞాపకాల ఒళ్ళుమరుపు, క్రందనాల ఆనందం
చైతన్యపు దర్పణాన్ని నింపేనీడల ద్వంద్వం
అవ్యక్తారణ్యంలో ఆరాచకపు భటులపోరు
కదిలే ప్రతి పాటచాటున ఒక దాగిన దగాకోరు
ఎన్నటికీ పూర్తికాదు జీవిత చక్రభ్రమణం
ఆగిపోదు కాలాగ్నుల కలుషిత ధూమ్రపు వమనం
ముందు వెనక చీకటి గల రెండు ప్రపంచాల మధ్య
ముందు వెనకలాడుతోన్న ఒక నన్నని చీలుబాట
ఇరుల కురుల పాపటిలా; రెండు సెకతాలమధ్య

కృశకాయ శరన్నదిలా అస్తిత్వపు ప్రాకులాట.
నిరవధి కాలావధిలో అరనిమునం
ఇరు ప్రక్కల అగాధాల ప్రేవుల్లో పిరికిపాట
చూపులేని ఆకాశపు కన్నుల కనుపించవి కసి
జనన మరణనంధ్య రక్తాభల దోబూచులాట
అరనిమునం, మళ్ళా నీ ముందు, వెనుక అంతా మసి.
పై కెగిరిన గులకరాయి మరల నేల రాలబోయి
ఆ శూన్యాధర త్రిశంకు స్వర్గంలో స్తంభించిన
రెప్పపాటులో వేదన, ఇక పతనం, ఇక శయనం
నిరవధి కాలావధిలో జీవితమే ఒక్క క్షణం.
తప్పొప్పుల నిర్ణయ మిటి దుస్సాధ్యం,
మానవునకు క్రియ ఒకటే ఆరాధ్యం,
నీ నుంచి నీది కానిది ప్రతిదీ సైతానువలుకు
చీలుబాటపై నిలచిన తెరువరి ఎదలోని ములుకు
నీ వెంబడి నీ ప్రేతం, నీదే ప్రేతపు గొంతుక
స్మృతి పటలపు సౌదామిని, గతసుమాల వాసంతిక
ప్రేతానివి నీవైనా నమ్మకు ప్రేతాన్ని నీపు
ప్రేతం కాలిడినచోట విరియదింక బ్రతుకుపూవు.
మనస్సాక్షి గుసగుసలో అది ప్రేతపు వెక్కిరింత
చేతం సంశయగ్రస్తం, అడుగడు గొక రోతచింత
మనస్సాక్షి మనల నిలా చేస్తుంది పిరికివాళ్ళను
తడుపుతుంది స్నేహంతో ఎండిన మమతల మ్రోళ్ళను
అడ్డుతుంది ఆలోచన బంధమై క్రియాపథాన
మరుగుపరుస్తవి నిజాన్ని ఊహల చిలువలు పలువలు
ఆలోచన క్రియతో శ్రుతి కుదరని ఒక భగ్నవీణ
మనిషక్కే చైతన్యపు మరణోన్ముఖ దీపశిఖలు
పలవరించి పొరలుతుంది పీడకలలు కనే ప్రాణి.

కూచుంటావా బ్రతుకుల తల పేలు చూచుకుంటూ
స్వకరుణ యను కుంపటికడ ఇడుముల చలికాచుకుంటూ
దొనగులపై మునుగుతీసి తేరి పారచూస్తావా
నూకలు పెడితే మేకలు పులి కడలక కాస్తావా
ఎంగిలి ఆకుల స్వర్గం చూచి ఆశపడతావా
నరకం రాజని పొయ్యని పిరికి కేకలెడతావా
ఆకుల లెక్కలుతీస్తే మొదటి కెవ్వరూ చేరరు
భాష్యపు తెన్నులు చూస్తే నిజమూల మరయనేరరు
ఆత్మను కోల్పోయి వారు గుంపులలో వెదుకుతారు
సత్యమందకే నీరన తథ్యాలను పిదుకుతారు
ఆత్మజయం దుర్లభమై కోరుతారు దిగ్విజయం
ఆంతర్యం దుర్బలమై బాహ్యం పటు కవచమయం
బ్రతుకు దొడ్డివాకిట ఈ మహాజనం గుంపులుగా
మానవాత్మ మర్యాదకు తీరని తలవంపులుగా
యుగయుగాల ఉచ్ఛిష్టపు ఒక పిడికెడు లభియించని బిచ్చం కొరకు
నిలుస్తారు యాచకోచిత శ్రేణిని విసిగి పారద్రోలే వరకు.
సాహసికుని కాదర్శం కానేరదు వెకిలిమంద
ఐతే మరి ఎవ్వడింక పిరికిపంద ?

కల లొస్తాయని భయపడి కనులు మూయలేనివాడు
కలలు కరిగి పోతాయని కనులు తెరువలేనివాడు
ఆకాశపు స్వేచ్ఛ చూచి మోము త్రిప్పుకానేవాడు
చెరలోన ఊపిరాడక మొరబెట్టుకొనేవాడు

పిరిక గుండెలో శ్వానలు
పిరికి కనుల అడియానలు
ఎవ్వరిదో ధీరత్వం?
ఎవ్వరిదో భీరుత్వం ?

విస్మృతి వననిర్జన సీమాప్రాంతం
నిద్రిత చైతన్య మిచట నిసికాపరి
పాంచివున్న వన్యమృగం కానివ్వదు కథ సాంతం
గుర్రుగుర్రు మంటున్నది పెనుచీకటి పొద కా దరి.
చెమటలు పోస్తాయి, చల్లబడుతవి చేతులూ, కాళ్ళూ
గుండెలపై దెయ్యం కూచున్న బరువు
డొల్లబొందెలో ఎలుకల నదురు బెదురు లేని దొళ్లు
పీడకలల తొండం చాచి ఏనుగుల కడుపు కరువు;
నల్లబండ పిరి కెరుగదు, ఊపిరి తెస్తుంది పిరికి
పిరికి మనిసి తుదితెగించి ధైర్యం చేగొనేవరకు
వృద్ధవేశ్య నడివీథిని నిలువబడి పిలుస్తోంది
తలవంచుక పోయేవా డొకడైతే

నిలచి మారు పలుకుతాడు మరిఒక్కడు,
వీరిద్దరిలో ఎవ్వడు పిరికి పంద ?
చూచావు రాజసభలో, ఎండుగడ్డిలా వెరసిన గడ్డాలని
కృత్యాలు లెక్కవేసి, కృతకర్మల లెక్కచూసి
జహ్నుమౌని జంఘలోంచి భాగీరథి
బయటపడే యుక్తులు నూచిస్తున్నవి;
రాజధర్మవర్మంలో రాచరికం నుంచి తప్పుకొవే రాజు
నవనిర్మితము కుట మణులు గుణియించే పట్టరాణి
వేలకొలది దీపశిఖల తెలివెలుగున మెలుగుతున్న,
దాపరికం లేనిదాన్ని దాచేందుకు ప్రయత్నించి
జనులు చూడగోరని దాన్ని చూపేందుకు ప్రయత్నించి
ఉల్లిపొరల దుస్తుల్తో వెలుగుతున్న, చెలగుతున్న
రాకొమరితలు. పావం, ఉల్లిపొరల దుస్తుల్లా సిగ్గులేని సిగ్గు
నానాద్రవ్యాల నుంచి ఎరువు గొన్న నిగ్గు;
శోకస్తంభాల నీడలో నిలబడి గమనించా వీ బ్రతుకును

హృదయపు నైశ్శబ్ద్యంలో విన్నావా వికవికలను
నీవు పారిపోయావా బ్రతుకునుంచి
బ్రతుకు పారిపోయిందా నీ నుంచే?
ఒడున నిలబడినవారు
ఏటి నీటి నుడిలో, పరవడిలో ఉరవడి కనుగొన గలుగుతారు
జలవేగోద్వేగానికి రాగావేగాని కనలిదూరంగా
చెలరేగే అలల బలం కొలుస్తారు
జ్ఞానం వ్యవధాన మయ్యి నడుమను దుర్వారంగ
వర్జిస్తే గర్జించే ప్రవాహాన్ని పిలుస్తారు
జ్ఞానం అంతరంపెంచి అంతరాయమైవస్తే
వేరైపోతారు వారు పారే చదలేటినుంచి
పోరుచూచి, హోరుచూచి. బేజారై ఊరకపస్తాయిస్తే
పారుదలను వేర్వలేరు వారు బ్రతుకు నీటినుంచి
జ్ఞానం దౌర్బల్యమయ్యి అజ్ఞానపుకవచంలో చూపుతుంది ఛిద్రాలే
చేటలతో చెరిగి రుజువు పరుస్తుంది బ్రతుకు పంటలో కాలే.
జ్ఞానం ఒక రంపంలా
చీల్చి, కోసి మానవుణ్ని తుత్తునియలు చేస్తుంది
అనస్తిత్వ పరిచయాన్ని క్షుద్రాస్తిత్వపు టావేదనతో ముడివేస్తుంది.
మది చీకటి మూలలంట వెతల వెలుగు నింపుతుంది
మంటికి మానవునికి గల బొడ్డుత్రాడు తెంపుతుంది
జ్ఞాన మెరుక పరుస్తుంది
అనంతాంతరిక్షంలో పరమాణువు అల్పత్వం
భూతలిపై నరుని నిన్నహాయతలో చైతన్యపు క్షుద్రత్వం
జ్ఞానం నూచిస్తున్నది మరుపథాల హిమకణాల ప్రదాహాన్ని
సిద్ధి సింధు తీరసీమ చేరలేని సార్థవాహ ప్రవాహాన్ని
ఱెక్కల నత్తువ లుడిగిన పులుగులు దురపిల్లుతాయి
అందని ఆకాశతటుల నీలపు వన్నెలు కనుగొని

చిత్రలేఖకుని వ్రేళుల కొనలు నీరసిల్లుతాయి
స్వర్గిక స్వచ్ఛంద సుందరాకృతి సౌలభ్యం కని
తనను తాను కోల్పోయే అనుభూతికి అబ్బులుచాచే ప్రియునికి
తనను తాను కోల్పోతే ఉండదు అనుభూతి అనలు
లక్ష్యం చేరక మునుపే మార్పు చెందుతాయి దిశలు.

జ్ఞానంలో ఉంది బాధ, బాధలోన అనుమానం
నిత్య నిరుత్తరపు ప్రశ్న జ్ఞానం యిచ్చిన దానం
అజ్ఞాతంలోంచి మరల అజ్ఞాతంలోకి పయనమే జ్ఞానం
జ్ఞానం నంకటభరితం, జ్ఞానం మోహన దురితం
జ్ఞానం అనమర్థ నరుని అపజయ యాత్రల చరితం
జ్ఞానం నంజీవి, జీవితార్తికి పరిభాష కనుక
జ్ఞానం ఋతశక్తి, అశక్తతల అభివ్యక్తికి అది భాష కనుక
జ్ఞానం హోమాగ్ని, సర్వకర్మలు మసిచేయ గలదు
నిజం, కాని కర్మకూడ దానిని ఆర్పేయ గలదు
తడికట్టెలు మంటను తగ్గించినట్లు, పాపపూర్ణ కర్మవితతి
నీడలతో నింపుతుంది జ్ఞానాగ్నిని కుంటుబరచి జ్వలనపు గతి
శుద్ధ కర్మ జ్ఞానాగ్నిని ప్రజ్వరిల్ల జేయగలదు
జ్ఞానవహ్ని కర్మలనూ తేజరిల్ల జేయగలదు
కర్మకు, జ్ఞానానికి భ్రుతి కుదిరినపుడు
ఎగిరే విహగాలకుండ దావేదన
నంశయాన్ని చూచి స్వేచ్ఛ బెదరదపుడు
మానవునకుండదు తనతో వాదన.

అర్జున విషాదయోగం

అరుణుడు

'ధర్మక్షేత్రే కురుక్షేత్రే'

ఈ అష్టాదశాక్షౌహిణుల వర చతురంగ బలం

నిలబడింది బలివేదికవద్ద యజ్ఞపశువుల్లా

ప్రళయ ప్రభంజన పూర్వపు వారిధిలా వినిశ్చలం

మహాజనం, ఇదొక భ్రాంతిజనక శాంతి, వీరల్లా

నిమునఁలో పొంఘుతారు రణభేరుల ఉద్దీపన

త్వరాధీర తురంగాలు నహిఁచవిక కాలయాపన

ఒక చేతిని పాంచజన్య మొక చేతిని గాండీవం

నా హృదయంలానే అతి చలద్వికల కపిధ్వజం

అదురుతోంది యెడమ బుజం

సర్వం సంసిద్ధం భీకరనంగరరంగంలో

కాని వికటపటహ ఘోష మార్మోగే నా హృదంతరంగంలో

ఓకృష్ణా ! ఏదో ఒక చెప్పరాని ఆవేదన

ఒక సకరుణ మన్మణగీతి, నూతన తత్త్వాపాదన

ప్రస్వేదం స్రవిస్తోంది, నవఖేదం దహిస్తోంది

రణరంగలో ఎన్నడు ఎరుగని నిర్వేదం ఆవహిస్తోంది

శిథిలశింజినీ సదృశం కదనోత్సాహపు విపంచి పలుకదేమి

నా కన్నులనుంచి నేడు రోషం రక్తపు రోచులు చిలుకదేమి

కొండలనే పిండికొట్టి, పిడుగుల నరచేతలబట్టి

అరిసేనల చెండిసిట్టి ఇవి నా భుజదండాలా ?

లేక సరసిలో సరసీరుహభారం మ్రోయలేని మృదుమృణాలకాండాలా

మనక క్రమ్ముతోంది కనుల ముందు, మిగుల రోమాంచం

ఆడుతోంది నాముందే ప్రళయం విప్పిన పించం

26

నే యుద్ధం చేయలేను, మాధవా ! రథం మరల్చు
ఈ మిత్రవ నేలనుంచి వేగం వెనుకకు తరల్చు

శ్రీ భగవాన్ ఉవాచ

"క్లైబ్యమ్ మాన్మ గమః పార్థ !" ఇత్యాది

అర్జునుడు

క్లీబులైన వారెవ్వరు ? ఎవ్వరిదో క్షుద్రహృదయ దౌర్బల్యం
ఏది త్రోవ, చనిపోవదు చిక్కిన సంశయశల్యం

నా నమక్ష విపక్షాన కురువృద్ధులు, గురుతుల్యులు
ఆచార్యులు, పితామహులు, శూరులు హరిహరతుల్యులు

ఇట నున్నవి భరతాలయ పావనపూజా సుమాలు
ఏ నెత్తుటి గురుతులపై ఈ రథచక్రాల జాలు

ఈ అహవమందాహుతి భారతవీర్యపు సారం
వెలలేనిది, తులలేనిది, మాతృహృదయ మణిహారం

ఈ ఆహవ హోమంలో నయనీతులు నిగు తగ్గి
స్నేహం, ధర్మం, నఖ్యం అన్నీ అవుతాయి బుగ్గి

నిన్నటి వరకూ తలలో నాలుకలా మెలగినారు
తృటిలో నేడెలా గర్భశత్రువు లౌతారు వారు ?

జీవిత హరితోపవనంలో దావాగ్నులు రగిల్చి
ఏం చేస్తాం కడకు మనం పాడువల్లకాడు గెల్చి ?

మన భస్మాసుర బుద్ధులు తలపెట్టిన కటికి కీడు
మూడుతుంది మనకే, మన చేనే అవుతుంది బీడు

కృష్ణా ! చేసినవారికి చేసినంత, మన నాటిన ముళ్ళసాదలు
రేపటి పథికుల పదాలు చేయగలవు బదాబదలు

మన రేపిన పావధూళి మలినపరుస్తుం దెవ్వరినో తప్పక
మన ప్రశ్నకు ప్రత్యుత్తర మెవడో తప్పదు చెప్పక
అప్పుడు మన కర్మఫలవు మృతజాతదనుజశిశువును

నా చనగలవా డెవ్వకు వెరపొందక ఆ పశువును ?
మన కర్మలఫలం ఒక్క మనంకాదు, చవిచూస్తుం దఖిల జగతి
మన పదచిహ్నాల్లోనే బహుళ జీవితాల ప్రగతి
శైలగుప్త గహ్వరాల ప్రతిధ్వనులు లోఁజలధి లహరుల్లో
మనగానపు ప్రేరణల ప్రకంపనాళి గంధవహుని విసురుల్లో
ఒక యోచన ప్రతిస్వనం వేరొక మానస తటాన
ఒక హార్దిక దీపస్మితి ప్రతిరూపం వేరొక నిశిమసిపటాన

నా చేసిన ప్రతికార్యం
రేపటికి శిరోధార్యం

కర్మ యొనర్చిన మెలాగ, ఈ బాధ్యత కఠినతరం
వరణం దుష్కరం, ఇరుల తెరమరుగున స్వయంవరం
ఓదేవా, మన ముంగిట మిత్రవ పన్నిన వ్యూహం
ఆహవ మహోత్సాహం సైపని శూరనమూహం
వీరిలోన నేటినంజ శిబిరాలకు మరలే వారెంతమంది
శాశ్వత నైశ్శబ్యతటుల సైకతాల దొరలేవారెంతమంది
ఎంత మంది చూస్తారో రేపటి బాలార్కకాంతి
ఎంత మంది కీ కఠోరధరణిపైన చరమశాంతి
నలిగిన పచ్చికపై తెగిపడిన శిరను, కేలు, కాలు
తెలుపలేదు ఏది ఎవనిదో నెత్తుటి ఆనవాలు
పొరలుతుంది ముగ్గుబుట్టలా పండిన తల ధూళిని
పిరికి నక్క తన్నుతుంది ఆచార్యుని వరమౌళిని
క్షతగాత్రుల మృతికోసం నిశిచరాల జాగారం
ఒక గ్రుక్కెడు నీటి కొరకు మరణోన్ముఖ చీత్కారం
డేరాల్లో కలతనిదుర, కలవరాల పీడకలలు
నల్లకడలి ఉప్పెనలో మునిగితేలి తలల అలలు
అట ఇంద్రప్రస్థంలో మగదిక్కులు లేని యిళ్ళు
నిర్జన నిశిలో జ్యోతులు మెరిసే తస్కరుల కళ్ళు

దివ్వెలకడ చేరి దీన ప్రశ్నలు వేసే పిల్లలు
ఏ సాంత్వన మివ్వగలరు శంకాకులలై తల్లులు
అవలంబం లేకుండా తీవెలెలా బ్రతుకుతాయి ?
అపలంబం కొరకు మరల ఏకోనలు వెదకుతాయి ?
తిరిగి యివ్వబడని దాన్ని గైకొనగల హక్కెవనికి
హింసే ధర్మం అయితే ఎవ డిక్కడ దిక్కెవనికి ?
బ్రతుకు పలకపై వ్రాసిన ప్రత్యక్షర మక్షరమే
సపరించే సమయమేది, ప్రతి దోషం నిర్జరమే
చేసిన పని చెరగి పోదు, రానున్న తరాలవాడు
మన విజయపు కీర్తి సౌధశిథిలాలను అడుగుతారు
కీచురాళ్ళ గొంతుకలై, అప్పుడు ఏమిటి జవాబు
ఎవరికంద జేయగలం పశ్చాత్తాపాల జాబు ?
అప్పుడు ఆవులిస్తాయి గోరీలే నోళ్ళు తెరచి
ప్రేవుల లెక్కల్లో మన తిక్క వనులు బయలుపరచి
బీళ్ళు దున్నితే పుట్టలు చాటుతాయి పకపక మని
పూర్వుల ఔన్నత్య గరిమ వేనోళ్ళను అందరికిని
సిగ్గిలి జను లంద రపుడు తలలు వంచు కొంటారా,
లేక సగర్వంగా పాపాన్ని పంచు కొంటారా ?
ఈ అనిలో నశిస్తోంది యిరువాగుల సబల భరతజాతనం
ఏ హలధర బహుబలం స్పృశిస్తుంది ధరణి గర్భాభ్రూణం
విటుల కొరకు వెదకుతుంది విధవా వనుధావధూటి
ఎంగిలి మెతుకుల బ్రతుకులు గతుకుతుంది జీవకోటి
మన పిల్లలు, మన పాపలు, పిల్లల పిల్లలు పాపలు
శత్రు ధనుర్జ్యావిముక్త విశిఖ భీతులై నావలు
నిర్జన గహనాటవిలో తలలు దానుకొంటారా,
ఎముక ముక్కకై కుక్కలవలే కాచుకుంటారా,
ఈ యుద్ధం ఎవరి కొరకు, ఎవరు గరళఫలభోగులు

ఎవరి కనుల కొతుక మిది, ఎవరా మానన రోగులు
ఇట మరణించిన వారలు ఏమిటి అనుభవిస్తారు
బ్రతికి యున్నవారు మటుకు ఏమిటి అనుభవిస్తారు
ఏమిటి అనుభవిస్తారు రానున్న తరాలవారు
ఆస్థుల పరచిన పథాన వారేవిధి మెలగుతారు
ఎవరు గిలిచినా యిక్కడ ఫల మొకటే కట్టకడకు
ప్రజ్వల చితులై శోకనల మొకటే కట్టకడకు
కోల్పోవలసిందంతా అనిలో కోల్పోయినాక
పతనపు చీకటి లోతుల అడుగంటా పోయినాక
ఎవరికి కావాలి గెలుపు; ఆ బాటకు లేదు మలుపు
ఇరుల తెరల ఆ చెరకిక లేదెటనూ వెలుగు తలుపు
ఈ యుద్ధం నిలబెట్టిన ధర్మ మెక్క డుంటుందిక
ఏ మరపుల నిద్దురలో పిరికి కలలు కంటుందిక
మన ఆశలన్ని అడియానలయ్యి
మన హానమెల్ల పరిహాసమయ్యి
అభినందనాలు క్రందనాలయ్యి
అభివందనాలు క్రందనాలయ్యి
మన నాటిన చేతల వృరాశి
మొనటికే చేటుగా కాపుకాసి
జీవితమే దుర్వహభారమయ్యి
తీరంనానాటికి దూరమయ్యి
కాలం కరాళ మౌతుంది కడకు
యాతన కరాళ మౌతుంది కడకు.
రుధిర ప్రదిగ్ధ భోగాల భ్రాంతి
కలిగిస్తుం దెవరికి ఆత్మశాంతి
ఉల్లాస రాగిణుల నృత్యరీతి
స్మరణకు తెస్తుందార్తుల విభీతి

స్మేరాననాల మధుచుల ఁమోల
పొడ కడుతుఁదాహతమృత్యుడోల
న్వర్ణాభ దీపయిత పొధశ్రేణి
కడనే ప్రదోషహత కురుక్షోణి
మృదుహంస తూలికాతల్ప నిద్ర
లో భీషణ దుస్స్వప్నాల ముద్ర
అంతర్గత కలుషపు ధూమ్రవీచి
కననీయదు మోచనసూచిరోచి
వీడవు మనలను ఆ జ్ఞాపకాలు
సెగవగపుల బ్రతుకే నగవు పాలు
వెన్నంటిన చావుల నీడ పోదు
మరుపీగల చల్లని తంద్ర రాదు

పోదాం పద, ఓదేవా ! రాజ్య మెద్దు, రాజ్య మెద్దు
ఈ విద్వేషాగ్నుల కిక చేజేతుల ఆజ్యమెద్దు
అతి విస్తృతవసుధమీద దుర్లభమా ఆశ్రయమే
ఈ నెత్తుటి కూటికన్న జోలె బ్రతుకులే నయమే
లేదవదే ప్రకృతిమాత, తన బిడ్డల కాదనదే
నీ కిక్కడ చోటెక్కడ ఈ ప్రాంతం నాదనదే
ఎదులకీ నఁఘర్షం, హృదిలో మోరామర్షం
హర్షంగా క్రూరుడైన మనుజునికే అపకర్షం
జీవిత మాహవమైతే మృత్యువునే గెలు పనాలి
ఫలమేమిటి యిలలో యిక కలవరమే ఫల మనాలి
పోదాం పద, హైమాద్రిని నిద్ర పుచ్చుతోంది మంచు
దేవదారు తరుపంక్తుల పచ్చగిలిన లోయ అంచు
మెత్తని పచ్చిక పరుపులపై బ్రతు కొక పువ్వక్కడ
సెలయేరుల కలగీతుల ప్రతిరవమే నవ్వక్కడ
సంతాపం ఉండ దచట, ఏ పాపం పండ దచట

కాలమ్మగి మానవుడికి కాలం మరి నిండ దచట
వసివాడదు ఎన్నడునూ కోమల కలధౌత కాంతి
ఓదేవా, పోదాం పద, అక్కడ ఉన్నది ప్రశాంతి.
శ్రీ భగవాన్ ఉవాచ
"తత స్వ్వ ధర్మంచ కీర్తించ....." ఇత్యాది

ఆర్జునుడు

నిన్ను మించి హితు లెవ్వరు దేవా, నాకీ భువిలో
నిన్ను మించి గతులున్నవి దేవా, నాకే దివిలో ?
నా సంశయ సాంధ్యళ నీ సైగే ధ్రువతారిక
నా యోచన నీ సూచన కెల్లప్పుడు పరిచారిక
ఆశయ శిఖరాల పైకి ఎక్కించే శక్తిఏది
చెదరిన నమ్మికల గూడు దక్కించే యుక్తిఏది
నీబిగిచేయూత దక్క, నీయందే నా విముక్తి.
నా అభేద్య కవచం కాగల దొక నీ నిర్భయోక్తి
నేసైనది నీకన్నులలో బొడమిన నా రూపం
నీ కనుబొమ్మల ముడిలో నా శాత్రవులకు శాపం
నీ గుప్పిటలో మణిలా నా స్వేచ్ఛకు సంరక్షణ
నా తలపుల పిరికి బంటులకు నీదే సంశిక్షణ
ఈ విషమ సమస్యనుంచి బయటబడే బాట చూపు
నా దుర్బల హృదయంలో సంశయాల రూపు మాపు
బ్రతుకు చీలుబాటమీద నిలబడి యున్నాను నేడు
ఎటుబోతే పూలతోట, ఎటుబోతే వల్లకాడు ?
ఈ ప్రళయ ముహూర్తంలో ఏమిటి నా కర్తవ్యం
ఈ అగ్నిపర్వతంపై ఏ దిక్కున గంతవ్యం
దేనివలన జనులందరు తరతరాల సుఖిస్తారు
మన మహెూచ్చ నిర్ణయాన్ని సంప్రీతిని స్మరిస్తారు ?

రాజధాని

క్రోవ ఎక్కడ సోనియా!

గహన మాననకాననంలో చిక్కుతీవెల తలపు గుబురులు
సూర్యరశ్మలు సోక విచ్చట, నడులు ఆకుల గాలికబురులు
ఎప్పుడూ నడిరేయి చీకటి జడలు విచ్చిన కాననంలో
భీతి తప్పక ప్రతిఫలించదు హరితప్రకృత్యాననంలో
భ్రాంతి బంధుర మంతరం ఇట నర్వమున్నది కాని శూన్యం
గోచరిస్తుం దొకటి అన్నిట మనుజ మాత్రుల మతుల హైన్యం
వివిధ సిద్ధాంతాల కర్షణ, విషమ వైరుద్ధ్యాల ఘర్షణ
శప్తమానవ హృదయభూమిని అనవరత మొక అగ్నివర్షణ
కార్యకారణ పరిణతులపై శుష్కతర్కపు ఉకదంపులు
గ్రహవయో భేదాలపై గుణనాల చర్చల తెగని తెంపులు
కంచె కపతల ఉన్నదే కనలేని అస్థిర చపల మతులకు
ఎదుటి మనుసుల మర్మమెరిగే తీరుతెలియని వికల మతులకు.
తేంతరం ఒక అంధకందర. మంధమేధభ్రమద్దివాంధం
వలచినది కస్తూరి మృగమ్మై స్వీయనాభ్యుద్గమద్గంధం
ఎక్కడున్నది జ్యోతి ఇక్కడ, జ్యోతి అంతర్నిహతమ్మైతే
తొట్రువడతా డెందుకట్లా చీకటుల గుఱ్ఱాల దాతే?
బాహ్యమపి శూన్యం, మషావల్మీకిక తుల్యం మహానగరం
గగన చుంబిత మతి ప్రలంబిత ప్రతి బృహత్ ప్రసాద శిఖరం
దనుజ హస్తపు దీర్ఘరేఖల వలే పరచిన రాచబాటలు
సందుగొందుల మారుమ్రోగే క్రాగుబోతుల వెకిలి పాటలు
జీవితాహికి వేయినాల్కలు, లక్ష చీల్కలు, కోటికోరలు
క్రోవ తప్పిన నరుని హృదయం ఎక్కడున్నది?
ఈ కళేబరమరుస్థలిలో కండరాలే యినుకమిట్టలు

ఏది అమృతపు జీవనపు నది
మనుజు టటి ఏ కాకీ తనలో, గూఢ పీడల ఆంధ ఖనిలో
సాంత్వనల ఉపశమన మెక్క స్వీయఘోషల ప్రతిధ్వనిలో
కనుల ముంగిట మలక మంచుల న్వప్నరుదనాస్రాల ధారలు
నిదురలో పసిపాప బుగ్గలపైన ఆరని తడుగు చారలు
మనిగడల తిరునాళ నంచడి, తల్లిఏక్కడ,పిల్లడెక్కడ
నుందలో ఇవి పందగడియ ఎవరి కొవ్వరు సాయమిక్కడ
ఈ అపరిచిత ముఖాటవిలో వన్యమృగముల వికటాట్టహాసం
టీర్ణపర్ణస్రావరావం వినరివైచిన ప్రాసపాశం
ఎవడు హితుడిట, నుహృదుడెవ్వడు మనుజుడిట ఏ కాకితనలో
స్రవత్సంతత తిమిరఝరరుతయుత స్వాంత గభీఖనిలో
వెలుగు లెక్కడ సోనియా !

అహతా హులవలె మహౌర్మలు బునలు కొట్టిన వెగసి కన్సని
మెనుతుపానులు మూల్గు తున్నవి దిశల భూభంగాలు పసిగొని
త్రెంచుకొని బందాలు, ఉప్పెనపరుగు నురగలు గ్రక్కు తున్నది
శరణము ఎక్క, చిమ్మచీకటి చెరలలోకం స్రుక్కుతున్నది
ఘూర్ణితార్ణవ తాడితం ఈ మనుజ హృదయపు చిన్ని ద్వీపం
నిశాచ్ఛన్నం కుహాపన్నం కజ్జలాసిత తిమిరకూపం
దిక్కుదోచదు, ఎక్కడున్నది స్పర్శమణి జీవితషహాఘృణి
ఈత్తమిావైతరణిపారం చేరగల వరతరణి కారణి
వెలుగులెక్కడ సోనియా ! ఓ శైశవేషల కల్పవల్లీ !

వలవు కొల్లని చిలిపి చిన్ని చల్లని చిన్ని చల్లని కన్నతల్లీ !
శప్తవతనోన్ముఖ త్రిశంకుల పట్టుగొమ్మా !
బ్రతుకు లోతులు తరచి చూచిన దానవమా !

హృదయ కోణ త్యాగరాగపు డంచు నీడలు
అనుభవపు ముడుతసను దాగిన మరుగు పురుగుల వినపు జాడలు
కడుపుమంటల స్టికి ఆకలి కన్న ఆత్రం

కక్కురితి, నగుబాటు, పాపపు పుట్ట మానవ దీనగాత్రం
నీకు దుస్సహమే ప్రహారం, నీకు దుర్వహ మేది భారం
విశ్వశోకాశ్రువుల పూరం నీకు మౌక్తిక కంఠహారం
పంకనంకుల పాప సరసిని పూచినది నీ ప్రేమపద్మం
మహిత మమత మృత సుగంధ విముగ్ధ మధుకరశాంతిపద్మం

తెలుసుకొన దగనిదంతా తెలుసుకొన్న నీవు
తెలుసుకొన దగినదాన్ని తెలుప గలవు నాకు
నిరాధారపు దారులంట పయనించిన నీవు
ఈ దారుల కాధారం చూపగలవు నాకు
పాపాల పాపవుగా పుట్టి పెరిగిన నీవు
ఈ పాపికి శాపముక్తి నివ్వగలవు నేడు
శోకాల చీకటిలో ప్రమ్గి మరిగిన నీవు
నా రాత్రుల వెన్నెలగా నవ్వగలవు వేడు
సోనియా ! సంశయ రజనిలో
ఆత్మహింసల ఘోరవనిలో

ప్రోవ తప్పిన ప్రేత కోటికి ప్రోవ ఎక్కడ, వెలుగు ఎక్కడ ?
బ్రతుకునే తాకట్టు గొన్నది మునిలి మిత్రవ ఎక్క డున్నది
ఋణవిముక్తికి ప్రోవచూపే హక్కు గొని తానెచట చన్నది
కాలచక్రం తిరుగ బడినది, రేబవళ్ళకు లేదు తేడా
రుధిర రోచుల కలుష గోళం పగటిరాజా రేయిరేడా !
ఎక్కడున్నవి నాడు మెరసిన ఆశయోదయ సదయి శోభలు
నేడు హంతక దృగ్గిగంతం గ్రక్కుతున్నది రక్తిమాభలు
నేడు నీ గర్వోచ్చమూర్ధం మంటితో మనకాడుతున్నది
పాప మారపు పాదధూళిని ప్రేమతో ముద్దాడుతున్నది
ఎక్కడున్నది నేడు తర్కం, నెత్తి కెక్కిన బుద్ధివాదం
గ్లానిలో అవసాన మొందినదా అహంకృత సింహనాదం
ఎక్కడున్నది నీ వివేకం, అంధభీతి, జుగుప్స, శోకం

35

మహెూన్మాదపు విపుల వాహిని క్రమ్మి కొన్నది నకలలోకం
బద్దమానవనియతి, యూదా మేలుకొని యున్నాడు నీలో
హంన లేదిట, ఎవరు చెపుకారేవి నీళ్ళో, ఏవి పాలో !
మాటిమాటికి నీ నరాలను మీటు తున్నది ఒక గొంతుక
రుధిర రుచిగల మరణ గంధం నంతతం హంతకుని వంతిక
ఎంత క్రమపడినా అతీతం చెరుగనీయదు ఒక ముఖస్మృతి
కోటి జన్మలకన్న మేటిగ నంభవిస్తుం దొక్క దుర్మృతి
భీతి క్షణికం, కాని ఫలితం యుగయుగాలా జంటవిడువదు
విసపు విత్తొకసారి వేస్తే తరతరాలా పంట విడువదు
రెండు కన్నుల విన్నదన మది, మిన్నుమన్నుల క్రమ్మికొన్నది
లోకమంతా శోకమయమై చిమ్మచీకటి చిమ్ముతున్నది
శాంతి ఎక్కడ భ్రాంతి తప్పక, పరిహసించే గడ్డిపోచలు
దిక్కులన్నీ వెక్కిరింతలు, మొయిలు నొసలున నల్ల క్రాచులు
స్వీయహృదయం న్యాయనదనం నేర చూరోపించబానికి
నరనరాలా గూఢచారులు దృష్టి నాపై ఉంచటానికి,
ఎక్కడున్నది ముక్తి నాకిక సోనియా ! ఇక దిక్కు నీవే
కన్నులున్నా గ్రుడ్డివాడిని బానటగ నా ప్రక్క నీవే
కలిమిలేముల గోరువెచ్చని మనక నంజల మంచుదుప్పటి
పిట్ట ఈకలు రాల్చునప్పటి, చెట్టు ఆకులు రాల్చునప్పటి
తరుణమిది, మన విజయబీజం ఎక్కడుందో నిద్రలో మరి
వెలుగు చీకటు లేమి లేవిట, లేడు చుక్కల ఒక్కకాపరి
దాటినాం పాలిమేరకూడా, వినం వెనుకటి పిలుపులేమో
సోనియా ! ఈ శూన్యసీమను ఒక్క నీదే బ్రతుకు హామీ
వహ్నిపథ నంకేత మెక్కడ జీవితపు సుఖశాంతి సీమకు
లాజరస్ మృత తంద్ర విడి వస్తాడు శాశ్వత కాంతిసీమకు
పిలుపు నీగళమంగళధ్వని, మృత్యు యజనపు జీవమంత్రం
యన్దవిరబంధన తతిని త్రెంచుక చేయగల దాత్మను స్వతంత్రం

అదే ఎగిసదాని మరచినదాని వేకువజాము లప్పుడు
నీతలై నిర్వచన మొందిన శ్వేతశంఖపు మెలకువల జడి
మహాసైశ్వర్యపు వనంలో మంచు నింపిన పూలరేకుల
కదలికలుగా విచ్చిని స్వన మెగయు చున్నది తేనెవాకల
పిలుపు మృత దుర్గతిలోంచి
నవజీవిత నద్గతిలోకి
ధ్వాంతం నుంచి కాంతిలోకి
భ్రాంతి నుంచి శాంతిలోకి
సోనియా! త్రోవ చూపు
వెలుగు చూపు, త్రోవ చూపు.

పాటలక్కం

ధన్
ధం
ధన్
ధం
ధన్ ధన్
ధం ధం
ధన్ ధన్ ధన్
ధం ధం ధం

ఆ(
అబ్బా
అబ్బబ్బా
ధన్ ధన్ ధన్

రా
రా రా
రావేరా
ధం ధం ధం
చూస్తావేం
పోసీకూ
వేసేరా
ధన్ ధన్ ధన్
ఇవి కత్తులు
ఇది వెత్తులు
ఈ తొత్తులు
అసి చత్తులు
జనశక్తులు

మది మెత్తుకు
ధన్ ధన్ ధన్
ధం ధం ధం
ఈతపళ్ళండోయి బాబు
గుత్తివంకాయ కూరోయి బావా
ఓ ఒహో హూహొహూహో పావురమా
బిరానరావే వరాలమూట
నవాన నానా ననాననానా
తీయని వెన్నెల రేయి
వానన వననన వానా
ధిమాకి చూపకు చలాకి పిల్లా
ముందుకు ముందుకు ముందుకు
వెనక్కు, ముందుకు వెనక్కు, ముందుకు
ఇది జననం
ఇది మరణం
ఇది కిరణం
భవ హరణం
ఇది ప్రళయం ఇది విలయం
ఇది విజయం మది అభయం
ఇది రాటం ఇది ఆటం
ఇది పిల్లుల చెలగాటం
పిల్లల రంకులరాటం
ఇది జనశాకర నమతా కరవాలం
ఇది వినతాధర మమతా న్వరజాలం
ఇది భీకర ధరణిధర సంఘట్టన
క్రోధాకర జనసాగర పదఘట్టన
ఇది స్వేచ్ఛా చిరనమరం

వ్రత దీక్షాపర మమరం
ఇది గుండెలలో బరువూ
ఇది తండులముల కరువూ
ఇది ఎండిన ఇల చెరువూ
ధన్ ధన్ ధన్
ధం ధం ధం
ధనన ధనన ధన్
ధమ మ ధమ మధం
ధన్ ధన్ ధన్ ధనా
ధం ధం ధం ఢాం
ధనా, ధనా
ఢాం, ఢాం

ఒక సమష్టి ప్రార్థన

ఓ దేవా !
ఘోరకలిలో, ఆకలితో, చింకి కంబళిలో
వార్ధక్య హేమంతాల ముడుతలు బడిన చలిలో
వివేకానికీ హృదయానికి మధ్యనున్న వ్యవధిలో
కాటుకకొండల నడుమ, ఇరుకు కనుములో అరుపగొన్న అవధిలో
వేళకాని వేళల్లో చోటుకాని, చోటుల్లో
జన్మించిన దౌర్భాగ్య నృసింహులం
నమ్మికలేని తరంవారం, దశ హీనద్విజ్వీహ్వాలం
ఓ దేవా మ్యాటినీ లేని ముహూర్తాన మా మొరాలకించవయ్యా !
మాతృ యౌవనవంకుతార మాత్రులమై జన్మించాం
గొల్లభామ మార్కు డబ్బా పాలతో పెరిగాం మేం
చీపుల నిరంకుశ శాసనం క్రింద, పమిట పిన్నుల కత్తుల బావిలో
విస్తరి చినగకుండా తినటం నేర్చుకున్నాం
నీలిపాత్రల, గుసగుసల పొంచిన పురాణం విని
కనుబు మూసి దుప్పటిలో కలలు కనటం నేర్చుకున్నాం
విరిగిన కుర్చీల పర్యవేక్షణ క్రింద, బ్లాకుబోర్డు యాజమాన్యంలో
పుచ్చుకున్నాం నకల విద్యల ప్రతిమించని మోతాదులు
ఈ ఎడుమ నెదుర్కొన్నాం నిర్భాగ్యుల మెన్నెన్నో అపవాదులు
ఆడపిల్ల జడ పట్టుక లాగిన
అపరాధాన్ని, గోడలమీది రాతలను క్షమించు
డిక్షనరీలో బూతుమాటల కర్థాలు వెదికితే
అది జానదాహ మనే ఎంచు
బిత్తరి చూపు, మానుగు ముద్దు, ఇబ్బందైన ఇరుకు కౌగిలి
ఘనతవహించిన రోమాన్సులు అవియన్నీ లెక్కగట్టకు;
గురుతు తెలియని చీకటుల సౌకర్యాన్ని
గురుతుకు తెచ్చి మమ్మును కష్టపెట్టకు;

ఎలా జీవించాం ఓదేవా ! నాచులా పీచులా పుట్టగొడుగుల్లా
వేళ్ళలేని తీగల్లా, వ్రేళ్ళ కొసల్లోంచి జాతకాలు సూచించిన
సామ్రాజ్యాల, సాహసకృత్యాలకోసం ఎదురుచూస్తూ
భవిష్యత్తు ఆశించిన, ప్రస్తుత మామోదించిన, గతం నిరూపించిన
ఉప్పులేని చప్పిడి సుమతీ శతక సత్యాలు నెమరువేస్తూ;
ఏమిటి సాధించాం !

మా కున్న ఒకే ఒక్క సామ్రాజ్యం పడకటిల్లు, మంచమే సింహాసనం
మేం చేసిన ఏకైక సాహసకృత్యం
నలుగురికో తటయెత్తుక తిరగటం.

నందేహ దేహాలం, ఆవేశ వేషాలం, హవ భావ స్వభావులం
మా చీని చీకాంబరాల పొరల క్రింద కేవలం దిగంబరులం
మ్యాటినీ లేని వేళ నీకు నిజం చెబుతున్నాం, తావిలేని పూవులం
మే మీ పై పై అలజడిలోన బొత్తుగా ఒంటరి తుంటరులం;
దేవా ! క్షమించు మమ్మ, చేసినవి చేసినందుకు
చేయనివి చేయనందుకు

పిందెలు కోసినందుకు, పండినవి కోయనందుకు.

విశ్వమంతట విహరించాం
మరుగుపడిన మారుమూలలు శోధించాం

పక్షులకు పాఠాలు, మృగాలకు వైజ్ఞానిక సామవేదం బోధించాం
తిరిగి తిరిగి యింటిజాడ మరిచిపోయాం
చెప్పి చెప్పి చెబుతున్నది మరచి పోయాం
చివరేమో కానరాదు, మొదటికి
మరలేదుకు తెరువున్నది మరచిపోయాం.

మేము వ్రేలు చీకటంలో సెక్స్ ఉందంటాడు ఫ్రాయిడ్
మేము కాలుచాపటమే ఆర్థికవిపర్యాస మంటాడు మార్క్స్
గంట కొట్టగానే చొంగకారుస్తూ
పడగెత్తే కుక్కల మంటాడు పావ్‌లావ్,

ఎలుకల మీద ప్రయోగాలు చేసి చేసి
మీరే ఎలుకలన్నా డొక శాస్త్రవేత్త.
అనుమానం వేస్తున్నది, మే మెవరం ఓ దేవా ?
సింహానికి జూలమర్చి, ఏనుగకు తొండ మిడిన మహానుభావా !

ఎక్కడైనా కనుపిస్తాం నీకు మేము
బజార్లలో; హెూటళ్ళలో, బీచిలో, పార్కుల్లో
నవ్వుతూ, వాగుతూ పౌడర్ పూతల మొగాలతో
పౌడర్ లాంటిదే ప్రేమ, చేరునవ్వు సబ్బు వానన,
పౌడరు చెరిగి నప్పుడు మా మొగాలు
నేషనల్ కాస్మిటిక్ బ్రాండు ఎరుపును కోల్పోయిన కపోలాలు !
ఎవ్వరూ చూడకుండా వరమివ్వు ఓ దేవా !
ప్రొద్దునపూట ఆలస్యంగా నిద్రలేచి, చికాకుగా ఉన్న వేళ
కలునుకునే వాళ్ళెవరూ రాకుండా చూడవయ్య ఓ దేవా !
దుర్భలులం, చిరునవ్వును పట్టి యుంచట మతికష్టం
ఎల్లప్పుడు సంతోషంగా ఉండట మసంభవం, ఇది స్పష్టం
అయినా ఒక్కొకసారి రాత్రివేళ గాలిలో
క్రోవ తప్పిన తావి వినుపు పిలిచి నపుడు
లేక—పొరుగు రేడియో లోంచి
గురుతు తెలియని కరం సైశ్శబ్ద్యాన్ని కలచి నపుడు
లేక—చల్లని వెన్నెల వెలుగున ఎరిగిన మొగం
ఎరుగని అంద మొందినపుడు
ఏవో పూర్వస్మృతులు వికల విధుర వక్షంలో
మెరుగు రవ్వలు చిందినపుడు
ఆకస్మిక కంపనంతో గుర్తిస్తాం జీవితాన్ని క్షణమాత్రం !
అప్పుడు మా చలితాధరాలుగాని, చెమ్మగిలిన కన్నులుగాని
గుట్టుబయట పెట్టకుండా చూడగలవా ?
సంక్రాంతి ధ్వాంతంలో పరాజయ

దుర్ముహూర్తపు పాదాక్రాంత వేదికపై
శప్తజాత మ్మకండు నుతులం, మరొక మనవి--
ఖాళీపొడరు డబ్బీల, తలనూనె సీసాల
అత్తరు బుడ్ల, అరిగిన బ్లేడ్ల మధ్య మేము
మురికి బట్టల శయ్యపై శాశ్వతంగా కనులు మూసిన తదనంతరం
మా అలసిన శరీరాలను కడిగించు ఒక్క కప్పు స్ట్రాంగు కాఫీతో;
గంధపు చెక్కలు లేకపోతే మాత్రమేమి
పేర్చమను చితిపై మేం కాల్చిన సిగరెట్టు పీకలన్నీ,
సమాధుల్లో పెట్టమను అరిగిన, వంచరు బడిన ట్యూబులు టైర్లు
చెడిపోయిన బ్యాటరీ రేడియో సెట్టు
చీకటిలో త్రోవచూపే బ్యాటరీ లైటు.
పడియుండనీ నరకంలోనో నాకంలోనో మమ్ముల నొకమూల,
వైతరణి ఒడ్డయినా పరవాలేదు, తిరిగి తిరిగి అలసి పోయాం.
సింహానికి పంజానిచ్చి ఏనుగకు దంతమిడిన మహానుభావా !
మ్యాటినీ లేనివేళ మా మొరాల కించవయ్యా ఓ దేవా !

కవి సమయం

ఈ విశ్వవ్యధా వారినిధి తటాన
బహుభంగుల ఫేనోజ్జ్వల, రుదనాకుల, క్షుభితోచ్చల తరంగాళి,
లక్షల అవ్యక్తరుద్ధ మూకకంఠ సందోహం ఈ సాగర సంపుటాన
ఏకైక మహాఘోషగ బయలు వెడలి
చాస్తున్నది అంబరచుంబనకరాలు
ఎన్నెన్ని స్వరాలీ చిన్ని చిన్ని శీకరాలు?
ఎంత మంది హేమ్లెట్లు, రాన్కల్నికోవ్‌లు తడబడు కోరికల్లోంచి
విడివడు భావాల్లె ఒక కంఠం కోరకు,
శంఖం కొరకు ఎదురుచూస్తూ
ఎదురు చూచి, త్రోవకాచి, గీతం కొరకు,
గీతం కొరకు ఎదురుచూస్తూ
ఏదో ఒక ప్రబలబాధ, మాటలు వెదుకుతున్న గాథ
తీరని కోరికల పోరు హొరని నోరెత్తినటుల
పొగమంచు ముసుగులోని యాకృతిలా, గాలిబాట
వెంట మాట తెలియరాని ఆరాటపు దూరపుపాట
ఎగురబోయే గరుత్మంతుడు రెక్క లల్లార్చినటుల
ఎక్కడనో ప్రభవించిన గిరికందరల ప్రతిధ్వనిలా
అస్తిత్వపు పాదపాన్ని కూకటి వేళ్ళనుంచి చూపేస్తూ
ముద్రిత హేమంతనేత్ర పత్రాలను నవకిశోర కింశుకాల
జ్వాలాంగుళ్యగ్రాలను స్పర్శిస్తూ,
నిదురించే మోవిమోది ముద్దులాగ
వ్యక్తావ్యక్తపు వినీల విపినంలో,
కుసుమ కపోలపాళిపై సౌరభ శ్వసనంలా
నిర్వికార కాసారపు పసరు నీళుల ప్రగాఢ వాత్సల్యంతో,
తన ప్రవేశపథ పరాగరాగోజ్జ్వల రోచులతో

దిక్కుల కనురెప్పలలో పరమోష న్స్వప్నాలను మేలుకొలిపి
చల్లనితల్లి ఒడిలా, మక్కువ నిండిన ముగుద కన్నుల్లా
అర్థమైన దానికన్నా అధికంగా న్పురించేది,
చేతలకు చెందరానిది, మాటలకు అందరానిది,
మరి ఇక్కడ దెబ్బతిన్న రిక్షాల్లా కూలి రాలే విమానాల
మండి మునిగే ఓడల, పట్టాలు తొలగి డీకొనే రైలుబళ్ళ తీరంలో,
ఇక్కడ నకల సన్మార్గాల నమ్యక్ నంగమస్థలిని
బిన్న వ్యాఖ్యానాల ఏకాభిప్రాయంలో
భాషాతీత భావనికరపు నమ్మిశ్లిష్ట నృత్యగతిలో,
విఫలమైనది అభివ్యక్తి నత్తివాని పలుకుల్లా,
మూగవాని కులుకుల్లా,
ఈ గుప్తమహానిర్ఝర కంఠస్వరం,
జలజలజల ధ్వని మాత్రం వినిపిస్తుంది
అందరాని ఆనందాల నుందర నంకేతంలా;
సిగ్గుపడి తలలు వంచిన శబ్దాలు,
అసమర్థతను గురుతించిన శబ్దాలు
పరాభూత కవికరంలో విరిగిన విల్లులాంటి భాష,
మొక్కవోయిన అమ్ము లీ శబ్దాలు,
తిరిగి తిరిగి విసిగి విరిగి కరగి చెరగి మురిగి నురిగి
గురుతులేని గులకరాళ్ళై, వంకర మేకల్లా, పిన్నుల్లా
గుర్రపు నాడాల్లా, వీధుల్లో, త్రోవలంట ధ్వనుల నీడల్లో నక్కుతూ
మహాచికపు మొగంలా, చిల్లిపడిన పాత్రలా అర్థం కారిపోతూ
ఖాళీడబ్బాల్లా మ్రోగుతూ, అసంఖ్యాకస్పర్శలతో జిగటబారే శబ్దాలు
వాటి చుటూ గడచిన గొంతుకల, రాబోయే రాగిణుల శతాబాలు.
గాలి విసరుల తావిలా తప్పించుకొని,
శిరీషనుమ మార్థవపు నవనవలా జారిపోతూ,
నులు మూసి, కిల కిల నవ్వి

కనబడక మాయమయ్యే మనోజ్ఞతను
ఈ త్రెగిన త్రాళ్ళు బెట్టి, వాక్యాల
మొండి గోడల మధ్య ఎలా బంధించటం ?
నిండుమదిలోంచి తొణకిన భావావిష్ట మహోధృతిని
నిరర్థక శబ్దాల నహారా సైకతాల్లో ఇంకనీక
జనసాగర సంగమానికి ఎలాగ అందించటం ?

స్వరనంకుల పథంలో సజ్జిత సన్నద్ధ రథం,
త్వరాతురుడు బుద్ధిసారథి, కాని కదలని శబ్దాలు మొండి గుర్రాలు
కాలాతీతమై పోతోంది, చెప్పవలసిన చెప్పెదలచిన దానిలో
ఇప్పటికి చెప్పిన దొక నహస్రాంశమైనా లేదు.
ఏమిటి చేసేది నేను ?

ఇచ్చట హర్షశోకాల ఋతువుల రతిలో
పూచి, వాడిపోయే దివారాత్రులు
వైభవాల గాజు పెంకుల గుట్టలపై పారేసిన పాటల రిక్తపాత్రలు
ఆశయాల చిన్నహానపు శిథిలాల్లోంచి,
తొంగిచూచే తథ్యాల వికృతాస్యం
వరమాలల శృంఖలాలు, పరిరంభపు కాలపాశ కటుదాస్యం

ఉదయ నుమాల శాంతిశయ్యల భ్రాంతిలోంచి
నమయినర్పపు గరళధ్వాంత హూత్కారం
నైశ్శబ్యపు నైవేద్యం అర్పించిన ఆదమరుపును
ఛేదించే క్రూర దూర చీత్కారం
నవపల్లవ డోలల్లోంచి జీర్ణ పర్ణ చూర్ణ ధ్వని, దీర్ణ వక్ష శీర్ణ ధ్వని
శైత్యచరణ హేమంతాగమం కొరకు వేచి ఉన్న మరకతవని;
ఎక్కడుంది ఆనందం ?
కుందన నందన గంధచ్ఛందం ?

కాదు, కాదు, లక్ష్యం ఇది కాదు అనలు
ఏదో స్వరనంపూర్ణత, స్థిరనమగ్ర నమీచీనత

బహువివరాల అఁగాంగాల
అణువుల్లోంచి మూలకందపు టాత్మలోకి
క్షుద్రరేణుకణం నుంచి, మహామేరు నగం వరకు
నంక్షుబ్ధ సాగరాల ఘోషనుంచి, మూగజీవాల భాషవరకు
అన్నిటినీ ఒకలయ, ఒక తాళం, ఒక రాగంలో మేళవించి
నాలో లోకం కొరకై, లోకంలో నా కొరకై
ఏకైక ఏహ్యాద్వైకం ఉరికించాలని కోరిక.
కాని, కడకు పాడుబడిన గుడిమాత్రం మిగులుతోంది,
వివరాల్లో విషయాన్నో, విషయంలో
వివరాన్నో కోల్పోడం జరుగుతోంది.
ప్రతి నిమిషం ధూళి రేగి చెరుపుతోంది గడచిన అడుగుల జాడలు
ప్రతి పగటి వెలుగు వెల్లువ నిన్నటి చీకటి నీడలు
ఎక్కడ మొద లెట్టడమో, ఎక్కడ తుది ముట్టడమో
ఈ విరిగిన పనిముట్టులతో ఏమిటి చెక్కడమో ?
పులుగు గొంతుక మూగబోయి, చిన్న తరంగోత్తమాంగాలు
నైశ్శబ్యపు శృంగం తాకి, జాలిగా తిరిగి, చెరగి పోయేవేళ
పువ్వుల చెవుల్లో గుసగుసల మంచు బొట్టులు
చల్లగా, మెల్లగా కరిగి పోయేవేళ
కంఠం, ఒక కంఠం కావాలి నాకు:
పుంఖానుపుంఖ శంఖాలమంటల ఘంటలాపలుకగల ఒక కంఠం,
కంఠం, నాకొక కంఠం,
మానవగీత ఆలపించే ఒక కంఠం.


३

50

NUTILOO GONTUKALU

by BAIRAGI

Sudhinol.



ఆలూరి బైరాగి చౌదరి

5-9-1925 - 9-9-1978

Check List

Book Number	PSOIF341	Date	18/10/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CJ, II, 48, 49		
Missing Pages	NIL		
Prepared By	Ch. Ramya	Cutting By	Ch. Ramya
Scanned By	P. Bhagathi	Pages	59